

# చదువు అవశ్యకతను తెలియజెప్పాం

'విడుదలైన అన్ని కేంద్రాల్లో సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. ఈ మధ్యకాలంలో ఇంత పాజిటివ్ బజ్ ఏ సినిమాకు రాలేదు. థియేటర్లో ప్రేక్షకుల నుంచి స్టాండింగ్ ఒవేషన్ లభిస్తున్నది. చదువు అవశ్యకత గురించి గొప్పగా చెప్పిన చిత్రమిదని అందరూ ప్రశంసిస్తున్నారు' అన్నారు దర్శకుడు సాహిత్ మోత్కూరి. ఆయన రూపొందించిన తాజా చిత్రం 'పొట్టేల్' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించారు. సురేష్ కుమార్ సడిగే నిర్మాత. శనివారం ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో నిర్మాత సురేష్ కుమార్ మాట్లాడుతూ 'థియేటర్స్‌లో అద్భుతమైన రెస్పాన్స్ లభిస్తున్నది. ఈ సినిమా విషయంలో మా అంచనాలన్నీ నిజమయ్యాయి. కొన్ని సన్నివేశాల్లో ప్రేక్షకులు కంటతడి పెడుతున్నారు. ఒక మంచి ప్రయత్నంతో సందేశాన్ని మేళవించి చేసిన ఈ సినిమా అందరికీ నచ్చడం ఆనందంగా ఉంది' అన్నారు. ఈ సినిమాలో తన పాత్ర గురించి అందరూ మాట్లాడుకుంటున్నారని, బుజ్జమ్మ అనే పేరుతో పిలుస్తున్నారని కథానాయిక అనన్య నాగళ్ల చెప్పింది. కెరీర్ ఆరంభంలోనే ఇంటెన్స్ క్యారెక్టర్ చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందని హీరో యువచంద్రకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# ఆ అభినందన వెయ్యేనుగుల బలాన్నిచ్చింది



'12ఏళ్ల క్రితం యష్‌తో ఓ సినిమా చేశాను. ఆ తర్వాత ఆయనతోనే జర్నీ కంటిన్యూ చేశా. మళ్లీ డైరెక్షన్ చేయాలనుకున్నప్పుడు హీరో శ్రీమురళి నాతో పనిచేసేందుకు ఇంట్రెస్ట్ చూపించారు. మా దగ్గర కథలేదు. అలాంటి టైమ్‌లో ప్రశాంత్‌నీల్ తన కథను మాకిచ్చారు. స్క్రిప్ట్ వర్క్‌కి రెండేళ్లు పట్టింది. రియల్ లైఫ్‌లో సూపర్‌హీరో అవ్వాలనుకునే ఓ కుర్రాడి ప్రయాణమే ఈ సినిమా. ఈ ప్రయాణంలో తను సొసైటీకి మంచి చేశాడా? చెడు చేశాడా? అనేది ఆసక్తికరంగా ఉంటుంది.' అన్నారు దర్శకుడు డాక్టర్ సూరి. ఆయన దర్శకత్వంలో కన్నడ హీరో శ్రీమురళి కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'బఘీర'. రుక్మిణి వసంత్ కథానాయిక. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి అగ్ర దర్శకుడు ప్రశాంత్‌నీల్ కథ అందించారు. హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు డాక్టర్ సూరి శనివారం విలేకరులతో ముచ్చటించారు. 'ఎమోషన్స్‌తో కూడుకున్న యాక్షన్ ఎంటర్టైనర్ ఇది. లార్జర్ దేన్ లైఫ్ తరహాలో ఇందులో హీరో పాత్ర ఉంటుంది. స్క్రీన్‌ప్లే గ్రిప్పింగ్‌గా ఉంటుంది. ప్రశాంత్‌నీల్ సినిమా చూసి అభినందించారు. ఆయన అభినందన వెయ్యేనుగుల బలాన్నిచ్చింది. ఈ కథలో ప్రాధాన్యత లేని పాత్ర ఉండదు. అజనీస్ లోక్‌నాథ్ ఎక్స్‌ట్రార్డినరీ మ్యూజిక్ ఇచ్చాడు. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చే సినిమా ఇది' అని తెలిపారు.



# వినోదాల వాసుదేవుడు

సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. సోమినేని బాలకృష్ణ నిర్మాత. శంకర్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 14న విడుదల కానుంది. డివైన్ ఎలిమెంట్స్‌తో కూడిన యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా రూపొందిందనీ, ప్రశాంత్ వర్మ కథ, సాయిమాధవ్ బుర్రా సంభాషణలు సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. వారణాసి మానస కథానాయికగా నటించిన ఈ చిత్రానికి కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, రసూల్ ఎల్లోర్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: నల్లపనేని యామిని, నిర్మాణం: లలితాంబిక ప్రొడక్షన్స్.



# ఆ న్యూస్ చూసి షాక్ అయ్యా!

**సినిమా** ప్రచారంలో భాగంగా విడుదల చేసిన ఫొటోలను సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారానికి వాడుకోవడం కథానాయికలకు ఇబ్బందిగా మారుతున్నది. గతంలో ఓ తమిళ చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా దర్శకుడితో కలిసి సాయిపల్లవి దిగిన ఫొటోను సోషల్‌మీడియాలో వైరల్ చేసి.. వారిద్దరికి పెళ్లయినట్లుగా ఫేక్‌న్యూస్‌ను ప్రచారం చేశారు. ఆ ఫొటోలో వారిద్దరూ మెడలో పూలదండలు వేసుకొని ఉండటంతో నిజంగానే పెళ్లయిపోయిందని అందరూ అనుకున్నారు. తాజాగా ఇలాంటి పరిస్థితే కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్‌కు ఎదురైంది. తమిళ నటుడు జయం రవితో ఆమె 'బ్రదర్' అనే చిత్రంలో నటిస్తున్నది. ప్రమోషన్‌లో భాగంగా ఇటీవల ఓ స్టిల్‌ను విడుదల చేశారు. అందులో జయం రవి, ప్రియాంక మెడలో పూలదండలు వేసుకొని ఉన్నారు. ఈ ఫొటో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ప్రియాంక మోహన్ నిశ్చితార్థం జరిగిందంటూ వార్తలొచ్చాయి. ఈ విషయంపై ఆమె స్పందించింది. సోషల్‌మీడియాలో వచ్చిన కథనాలు చూసి షాక్ అయ్యానని పేర్కొంది. 'ఈ ఫొటో చూసి నిజమని నమ్మిన చాలా మంది తెలుగు ఇండస్ట్రీ మిత్రులు నాకు ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పారు. అసలు ఏం జరుగుతుందో నాకు అర్థం కాలేదు. అది సినిమా స్టిల్ అని అందరితో చెప్పాల్సివచ్చింది. అసలు ఇలాంటి ఫొటో ఎందుకు రిలీజ్ చేశారని సినిమా టీమ్‌పై కోపమొచ్చింది.' అని ప్రియాంక మోహన్ చెప్పింది.

# అమ్మాయి ఔనంది ఏకంగా..



ప్రియదర్శి, రూపా కొడువాయుర్ జంటగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'సారంగ పాణి జాతకం'. ప్రతిష్టాత్మక శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతున్నది. డిసెంబర్ 20న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా నుంచి తొలి పాటను మేకర్స్ విడుదల చేశారు. 'సారంగో సారంగా.. అమ్మాయి ఔనంది ఏకంగా.. సారంగో సారంగా ఆనందాలందుకో అనేకంగా..' అంటూ సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, వివేక్ సాగర్ స్వరపరిచారు. ఆర్మాన్ మాలిక్ ఆలపించారు. 'హీరో ప్రేమకథకు మూలాధారం ఈ పాట. నిత్యజీవితంలో తనకు తారసపడేవారితో కథానాయకుడు సారంగపాణి తన ప్రేమని ఎలా ఆవిష్కరించాడో ఈ పాట చూస్తే తెలుస్తుంది. హైదరాబాద్‌లోని విభిన్న ప్రదేశాల్లో ప్రియదర్శి, రూప కొడువాయూర్‌లపై వినూత్నంగా ఈ పాటను చిత్రీకరించాం. ఇందులో సరికొత్త ప్రియదర్శిని చూస్తారు' అని దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ తెలిపారు. నరేశ్, తనికెళ్ల భరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పీజీ విందా, సహనిర్మాత: చింతా గోపాలకృష్ణారెడ్డి.

# ఓ అందాల రాక్షసి



షెరాజ్ మెహదీ స్వీయదర్శకత్వంలో హీరోగా నటిస్తున్న ప్రేమకథాచిత్రం 'ఓ అందాల రాక్షసి'. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు కూడా ఆయనే కావడం విశేషం. విహాన్షి హెగ్డే, కృతి వర్మ కథానాయికలు. సురేందర్ కౌర్ నిర్మాత. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో షెరాజ్ మెహదీ మాట్లాడుతూ 'ఇది మంచి కంటెంట్ ఉన్న సినిమా. ఓ విధంగా ఇది లేడీ ఓరియెంటెడ్ మూవీ అనొచ్చు. అమాయక స్త్రీలు కొందరి చేతిలో ఎలా మోసపోతున్నారో ఇందులో చూపించాం. మోసం చేసిన వారికి శిక్ష కూడా ఉంటుందని చెబుతున్నాం. సుమన్, తమ్మారెడ్డి భరద్వాజ ఇందులో కీలక పాత్రలు పోషించారు. సినిమా అందరికీ నచ్చుతుంది.' అని తెలిపారు. ఇంకా హీరోయిన్లు విహాన్షి హెగ్డే, కృతివర్మ, రచయిత భాష్యశ్రీ కూడా మాట్లాడారు. నేహా దేశ్‌పాండే, అనంత్‌బాబు, ప్రియా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కావేటి ప్రవీణ్. నిర్మాణం: స్కై ఈజ్ ది లిమిటెడ్.

# ఫౌజీ పోరాటాలు



హీరోలు ఒకేసారి రెండు మూడు సినిమాలు చేసే రోజులు కావివి. ఒక సినిమానే ఏళ్ల తరబడి లాగుతున్న రోజులివి. కానీ ప్రభాస్ ప్రయాణం మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఒకే టైమ్‌లో రెండు మూడు సినిమాలను కానిచ్చేస్తున్నారాయన. మొన్నటిదాకా 'రాజా సాబ్' షూటింగ్‌లో బిజీబిజీగా గడిపారు ప్రభాస్. ఇప్పుడు ఆ సినిమాకు కాస్త గ్యాప్ ఇచ్చి, 'ఫౌజీ' సెట్‌లోకి అడుగుపెట్టారట. హను రాఘవపూడి డైరెక్షన్‌లో పీరియాడిక్ వార్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్నది. పీరియాడిక్ వార్ సీన్స్‌ని ప్రస్తుతం ప్రభాస్‌పై చిత్రీకరిస్తున్నారని సినీ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ షెడ్యూల్ 20 రోజులపాటు జరుగుతుందట. ఇమాన్వి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. విశాల్ చంద్రశేఖర్ సంగీత దర్శకుడు.



# కృష్ణగిరిలో ఏంజరిగింది?

'నా గత చిత్రాలు కొన్నింటిలో కంటెంట్ పరంగా తప్పులు జరిగాయి. అలాంటివి రిపీట్ కాకుండా ఈ సినిమాను జాగ్రత్తగా తీశాం. ఇందులో అనవసరపు కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండవు. క్లైమాక్స్ ఘట్టాలు ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయి' అన్నారు హీరో కిరణ్ అబ్బవరం. ఆయన నటించిన తాజా చిత్రం 'క' ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌కు సుజీత్, సందీప్ దర్శకత్వం వహించారు. శనివారం ట్రైలర్‌ను ప్రత్యేకంగా ప్రదర్శించారు. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. ఈ సినిమాలో తాను పోషించిన వాసుదేవ్ పాత్రలో గ్రేషేడ్స్ కూడా కనిపిస్తాయని చెప్పారు. బీ, సీ సెంటర్ల ప్రేక్షకులే లక్ష్యంగా ఈ సినిమా తీశానని, 80వ దశకాన్ని ప్రతిబింబించేలా ప్రతీ సన్నివేశాన్ని అద్భుతంగా డిజైన్ చేశామని, కృష్ణగిరి అనే గ్రామంలో చోటుసుకునే అనూహ్య సంఘటనలు ప్రేక్షకుల్ని థ్రిల్‌కి గురిచేస్తాయని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: విశ్వాస్ డానియేల్, సతీష్ రెడ్డి మాసం, సంగీతం: సామ్ సీఎస్.








